



ఉట్టికొడుతున్న టీజీ వెంకటేశ్

ఉత్సాహంగా కృష్ణాష్టమి

- రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా సంబరాలు





వామన అలంకరణలో చిన్నారుల ప్రదర్శన





ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులుదీరారు. కర్నూలు నగరంలోని ఇస్కాన్ టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు. చిన్ని కృష్ణయ్యకు ప్రీతిపాత్రమైన పాలు, నెయ్యి, వెన్న తదితర ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అన్ని మండలాల్లోనూ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తల్లిదండ్రులు వారి పిల్లలకు రాధాకృష్ణుల వేషం వేయించి సంబరపడ్డారు. ముద్దులొలికే చిన్నారుల ఫొటోలను తమ కెమెరాల్లో బంధించారు. నంద్యాల పట్టణం పద్మావతీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నంద్యాల కల్చరల్





కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు



పాణ్యం వీరనారాయణస్వామి వారికి పూలంగి సేవ



చాగలమర్రిలో కోలాట నృత్యం చేస్తున్న మహిళలు

కబ్జా కోరల్లో వక్ఫ్ భూములు



శిరివెళ్లలో వక్ఫ్‌బోర్డు స్థలంలో భారీ భవన నిర్మాణానికి వేసిన పునాదులు

- ఉమ్మడి జిల్లాలో కనుమరుగవుతున్న ఆస్తులు
- రక్షణకు టీడీపీ హయాంలో ప్రత్యేక కమిటీలు
- గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ప్రభుత్వం మారినా శిరివెళ్లలో కొనసాగుతున్న వైనం
- నిర్లక్ష్యం వీడని వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు

శిరివెళ్ల, ఆగస్టు 26:

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొందరు యథేచ్ఛగా వక్ఫ్‌బోర్డు స్థలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు సాగిస్తున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో దాదాపు 1,104 వక్ఫ్ సంస్థలు ఉండగా వాటి పరిధిలో దాదాపు 22,599 ఎకరాల్లో వక్ఫ్ భూములు ఉన్నాయి. వీటిలో దాదాపు ఐదు వేల ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆస్తులను తిరిగి పొందేందుకు వీలు లేకుండా ముస్లిం మతపరమైన, ధార్మిక ప్రయోజనాల కోసం, మసీదులు, దర్గాల నిర్వహణకు ముస్లిం పెద్దలు, దాతలు భవనాలు, ప్లాట్లు, ఇతర భూములను విరాళంగా(ఇనాం) ఇస్తుంటారు. అలాంటి ఆస్తులన్నీ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉంటాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకులు, రియల్టర్లు రూ.కోట్ల విలువ చేసే వక్ఫ్ ఆస్తులను కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విలువైన వక్ఫ్ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు గట్టి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులకు రక్షణ కరువు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేల ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములకు రక్షణ కరువైంది. వక్ఫ్ భూములు, స్థలాలు వక్ఫ్ గజిట్, రికార్డుల్లో ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు అధికారులకు ముడుపులు చెల్లించి సబ్ డివిజన్లు, సర్వే నంబర్లు మార్చి సొంత భూములుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న దాఖలాలు ఉన్నాయి. మరికొంత మంది ఇనాం భూముల్లో అనుభవదారులుగా రికార్డుల్లో పేర్లు నమోదు చేయిస్తున్నారు. మండల కేంద్రమైన శిరివెళ్లలోని వక్ఫ్ భూముల్లో అక్రమార్కులు పాగా వేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు వ్యక్తులు విద్యుత్ ఉప కేంద్రం ఎదురుగా ఉన్న వక్ఫ్ భూముల్లో ఎలాంటి అనుమతులు, ఉత్తర్వులు లేకుండా భారీ నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వక్ఫ్ స్థలాల్లో చేపట్టిన పనులను అడ్డుకునేందుకు ప్రారంభంలో గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ వక్ఫ్‌బోర్డు అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. అనంతరం అక్రమార్కులు ఎంచక్కా వాటి నిర్మాణాలు పూర్తి చేసి వినియోగించుకుంటున్నారు.

అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములు

శిరివెళ్ల మండలంలోని వందలాది ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. శిరివెళ్ల మండలంలో గజిట్ నెంబర్ 43-ఏలో శిరివెళ్ల గ్రామంలో దాదాపు 314.96 ఎకరాలు, బోయలకుంట్లలో 77.29 ఎకరాలు, చెన్నూరు గ్రామంలో 33.8 ఎకరాలు, వనికెందిన్నెలో 27.31 ఎకరాలు, యర్రగుంట్లలో 84.42 ఎకరాలు, గోవిందపల్లెలో 15.62 ఎకరాలు, గుంప్రమాన్‌దిన్నెలో 30.26 ఎకరాలు కలిపి మొత్తం 583.66 ఎకరాల్లో వక్ఫ్ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 1963 నుంచి ఈ భూములన్నీ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు నుంచి ముందస్తు అనుమతులు లేకుండా ఈ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. శిరివెళ్లలో ఇందుకు విరుద్ధంగా నిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. ప్రభుత్వం మారినా వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. శిరివెళ్లలో సర్వే నంబర్లు 526, 537, 404 తదితర వాటి పరిధిలో పలు మసీదులకు ఇనాంగా ఇచ్చిన భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

గుట్టుగా అక్రమ రిజిస్ట్రేషన్లు

వక్ఫ్‌బోర్డు భూములను నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.కోట్ల విలువైన వక్ఫ్ భూములను గుట్టుగా అక్రమార్కులు కొట్టేస్తున్నారు. కర్నూలు పట్టణ పరిధిలోని జోహరాపురం ప్రాంతంలోని వక్ఫ్ భూములకు ముడుపులు పుచ్చుకుని రిజిస్ట్రేషన్లు చేశారన్న ఆరోపణలతో విచారణ నిర్వహించిన అధికారులు కల్లూరు రిజిస్ట్రార్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. రూ.కోట్ల విలువ చేసే భూములను అక్రమార్కులు యథేచ్ఛగా కొట్టేస్తున్నా వక్ఫ్‌బోర్డు అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తప్పుడ ు రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వ్యక్తులతో పాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటేనే వక్ఫ్‌బోర్డు భూములకు రక్షణ కలుగుతుందని దాతలు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శిరివెళ్లలో వక్ఫ్‌బోర్డు స్థలంలో ఇటీవల నిర్మించిన భవనం

ప్రత్యేక కమిటీలు నిర్వీర్యం

వైసీపీ అధికారంలోకి రాక ముందు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో కలెక్టర్ కాంపిటెంట్ అథారిటీ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో ఎస్పీతోపాటు డీఆర్‌వో, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులను సభ్యులుగా నియమించింది. ఈ కమిటీలు జిల్లాల్లో ఉన్న ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకొని జిల్లా వక్ఫ్‌బోర్డుకు అప్పగించేలా బాధ్యతలు కట్టబెట్టారు. దీంతో చాలా మేర వక్ఫ్ భూముల్లో ఆక్రమణలు తగ్గాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా వక్ఫ్ కాంపిటెంట్ అథారిటీ కమిటీలు నిర్వీర్యమయ్యాయి. వక్ఫ్ భూముల రక్షణ కమిటీలతో సమావేశాలు సైతం నిర్వహించనేలేదు. దీంతో అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు, ప్రలోభాలతో వందల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

వక్ఫ్‌బోర్డు భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే విచారణ నిర్వహిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్ స్థలాల్లో చేపట్టిన, చేపడుతున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయికి వెళ్లి వక్ఫ్ భూములకు చెందిన సర్వే నంబర్లను పరిశీలిస్తాం. ఏవైనా అనధికారిక నిర్మాణాలను గుర్తిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వక్ఫ్‌బోర్డు నుంచి ముందస్తు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం.

- షాషావలి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, నంద్యాల జిల్లా

శ్రీశైలానికి 71,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం, ఆగస్టు 26: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం జూరాల నుంచి 1,30,001 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2280 క్యూసెక్కులు మొత్తం 1,32,281 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 71,331 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.0320 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,169 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు మొత్తం 66,051 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

బనగానపల్లె పోస్టాఫీసులో
దోపిడీకి యత్నం



పోస్టాఫీసులో నగదును లెక్కిస్తున్న క్లూస్‌టీం, పోస్టల్ సిబ్బంది

బనగానపల్లె, ఆగస్టు 26: బనగానపల్లె పట్టణంలోని పోస్టాఫీసు లో దొంగలు దోపిడీకి యత్నించారు. శనివారం పోస్టాఫీసులో పని పూర్తి అయ్యాక డిపాజిట్ అయిన రూ.8.16 లక్షలను సిబ్బంది భద్రపరిచారు. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పోస్టాఫీసు తాళాలు పగుల గొట్టి నగదును దొంగిలించడానికి యత్నించారు. సోమవారం ఉదయం స్వీపర్ అంకాలమ్మ కార్యాలయాన్ని శుభ్రం చేయడానికి రాగా పోస్టాఫీసు తాళాలు పగుల గొట్టినట్లు గుర్తించి పోస్టుమాస్టర్ దస్తగిరిరెడ్డికి సమాచారం అందించింది. వెంటనే ఆయన పోస్టల్ శాఖ ఎస్పీ శ్రీనివాసులు, బనగానపల్లె సీఐ కృష్ణయ్యయాదవ్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ కృష్ణయ్య నంద్యాల నుంచి క్యూస్‌టీం, కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన నగదును లెక్కించారు. నగదును దొంగిలించలేదని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణయ్యయాదవ్ తెలిపారు.



అక్కాజమ్మ చెరువుకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ప్రతి ఎకరాకు సాగు నీరివ్వడమే లక్ష్యం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 26: ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవడమే తమ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె మండలంలోని చెర్వుపల్లె గ్రామ సమీపంలోని అక్కాజమ్మ చెరువుకు ఎస్సార్బీసీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం విలేకరు ఈసందర్భంగా అక్కాజమ్మ చెరువుకు నీటిని విడుదల చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం నదుల అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అక్కాజమ్మ చెరువు లిఫ్ట్ ఇరిగేషన్, సంగపట్నం లిఫ్ట్ ఇరిగేషన్, జుర్రేరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి రైతులకు అంకితం చేశామని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం సరైన సమయానికి నీటిని లిఫ్ట్ ద్వారా విడుదల చేయలేదని, దీంతో రైతులు నష్టపోయారన్నారు. ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తూతూమంత్రంగా ట్రయల్ రన్ ద్వారా నీటిని విడుదల చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేసి ఎస్సార్బీసీ ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. అక్కాజమ్మ చెరువు ద్వారా 126 ఎకరాలకు ప్రత్యక్షంగా సాగు నీరు అందుతుందని వివరించారు. పరోక్షంగా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పెరుగుతుందని, తద్వారా వందల ఎకరాలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కోవెలకుంట్లకు చెందిన కర్రా గిరిజ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నా ఒక్క కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూడా తేలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం సహకారంతో నదుల అనుసంధానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో రైతులకు మరిన్ని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు తీసుకువచ్చి ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టీడీపీ యువ నాయకుడు పీపీ నాగార్జునరెడ్డి, చెర్వుపల్లె గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, రామసుబ్బయ్య, ఎం.మద్దిలేటి, రామకృష్ణ, సాయిబాబా, ఐడీసీ ఏఈ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వివాదాస్పద వీఆర్వోలు..

పోస్టింగుల కోసం పైరవీలు..!

- ఏళ్ల తరబడి కోడుమూరులోనే విధులు
- బదిలీ నిలుపుకునేందుకు తంటాలు

కోడుమూరు, ఆగస్టు 26: కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆ నలుగురు వీఆర్వోలదే రాజ్యం. కొత్తగా వచ్చిన తహసీల్దార్లకు అంతులేని ఆదాయ వనరులు చూపిస్తారు. అక్రమార్జనకు అలవాటు పడిన తహసీల్దార్లు ఈ వీఆర్వోలు చెప్పిన మాటకు తలవంచక తప్పని పరిస్థితి. 15 ఏళ్లకు పైబడి కోడుమూరులోనే విధులు నిర్వహిస్తున్న కొందరు వీఆర్వోలు బదిలీలను నిలుపుదల చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి ఇక్కడే ఉండటం వల్ల వ్యవసాయ భూముల మ్యుటేషన్ కోసం వచ్చిన రైతుల నుంచి భారీగానే డబ్బులు డిమాండ్ చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. వారి మాట వినకుంటే భూమిలోని లొసుగులను రైతు ప్రత్యర్థి వర్గానికి చేరవేస్తారు. రైతు ఇది అర్థం చేసుకునే సరికి జరిగిపోవాల్సిన నష్టం అంతా జరిగిపోతుంది. అడిగినంత డబ్బు ఇస్తే చిన్న అవకాశం ఉన్నా చిటికలో ఎవరి భూమినైన ఆన్‌లైన్ అడంగుల్లో చేరుస్తారు. జగన్ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులకు పెద్ద ఎత్తున భూములను దోచిపెట్టిన సందర్భాలు ఉన్నాయి. వీళ్లకు ఇప్పటికి వైసీపీ నాయకుల అండదండలు ఉన్నాయి. వీళ్ల బదిలీలను నిలిపివేయాలని వైసీపీ నాయకులు టీడీపీ నాయకులకు రాయబారం పంపుతున్నట్లు సమాచారం. మండలంలోని ఓ వీఆర్వో 2009లో పదోన్నతి పొంది నేటి వరకూ అక్కడే పాతుకుపోయారు. ఆయనకు మళ్లీ పదోన్నతి వచ్చినా వద్దనుకుని వీఆర్వోగానే విధులు నిర్వహిస్తుండటం కొసమెరుపు. ఆయనకు కోడుమూరులోని భూ సమస్యలు, భూ తగాదాలు, కోర్టు వ్యవహారాలు ఈయనకు తెలిసినంతగా ఎవరికి తెలియవు. ఈయనపై గతం నుంచి ఎన్నో ఆరోపణలు వస్తున్నా అధికారులు ఇక్కడే ఉంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



తహసీల్దార్ కార్యాలయం



ఇక సి.బెళగల్ మండలంలో ఓ వీఆర్వో పుష్కర కాలం నుంచి అక్కడే ఉన్నారు. ఆయన కూడా తన స్థానం పదిలం చేసుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాడు. కోడుమూరు మండలంలో వీఆర్ఏ నుంచి పదోన్నతి పొందిన ఓ వీఆర్వో కోట్ల కుటుంబంలోని వైసీపీ నాయకుడికి వీరవిధేయుడిగా ఉన్నాడు. ఆరు నెలలు ఇతర మండలంలో పనిచేసి తనకున్న రాజకీయ పలుకుబడితో మళ్లీ కోడుమూరులోనే కొనసాగుతున్నాడు. కోడుమూరు టౌన్‌లో ఓ వీఆర్వోపై లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఒకరి పొలాలు ఒకరిపై ఆన్‌లైన్ అడంగల్‌లో ఎక్కించి సమస్యలు సృష్టించి పెద్ద మొత్తంలో డబ్బులు కూడపెట్టినట్లు సమాచారం. ఆయనకు ఇప్పుడు బదిలీ అనివార్యం అయింది. బదిలీని నిలుపుదల చేసుకోవడమా? లేదా పక్క మండలానికో, పంచాయతీకో మార్పు చేసుకోవడమా? అన్న సందిగ్ధంలో పడ్డాడు. ఈ మేరకు రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌ను వివరణ కోరగా అవినీతికి పాల్పడినట్లు వీఆర్వోలపై ఫిర్యాదులు వచ్చి, విచారణలో భాగంగా అది నిజమని తెలిస్తే సదరు ఉద్యోగులను కలెక్టర్‌కు సరెండర్ చేస్తానన్నారు. తన దృష్టికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో నీరు ఆదా

ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 26: డ్రిప్ ఇరిగేషన్ విధానంతో నీటిని ఆదా చేయడంతో పాటు పంటల సాగు కూడా సులభతరమవుతుందని కర్నూలు జిల్లా ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. రైతులు పంట సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడిని సాధిస్తారన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేస్తే రైతులు తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడిని పొందడమే కాకుండా ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులు కూలీల ఖర్చులో 60 శాతాన్ని ఆదా చేసుకోగలుగుతారన్నారు. నీటి పొదుపు 30 నుంచి 70 శాతం పెరుగుతుందని, కరెంటు ఆదా కూడా 40 శాతం వస్తుందన్నారు. ఎరువుల ఆదా 34 శాతం పెరిగి అధిక దిగుబడి 30 నుంచి 70 శాతం వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని ప్రతి రైతుకు అందించేందు కోసం పెద్ద ఎత్తున రాయితీని అందిస్తుందన్నారు. మొత్తం ఖర్చులో రైతులు కేవలం 10 నుంచి 50 శాతం మేరకే ఖర్చు పెట్టే అవకాశం ఈ పథకంలో ఉందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 15వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేసేందుకు కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేశామని, ఇందులో భాగంగా రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 10వేల మంది దాకా రైతులు డ్రిప్ ఇరిగేషన్ కావాలంటూ తమ పేర్లను నమోదు చేసుకున్నారనీ పీడీ తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక

జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 26: కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో నష్టపోయిన రైతుల కోసం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. జొన్న పంటకు సంబంధించి 863 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు 80 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. అదేవిధంగా సజ్జ పంటకు 82వేల క్వింటాళ్లు, కొర్ర పంటకు 260 క్వింటాళ్లు, ఉలవల పంటకు 375 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. వీటిని 80 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జేడీ వరలక్ష్మి సూచించారు.

దేవరబెట్ట కల్వర్టు పనులు పూర్తి

రాఘవేంద్రరెడ్డి సొంత నిధులతో పనులు



పూర్తయిన దేవరబెట్ట కల్వర్టు పనులు


కోసిగి, ఆగస్టు 26: దేవరబెట్టా.. వెళ్లేదెట్ల..? అన్న కథనానికి మంత్రాలయం టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్రరెడ్డి స్పందించారు. తన సొంత నిధులతో సోమవారం కల్వర్టు పనులు పూర్తి చేయించారు. దీంతో గ్రామస్థులు రాఘవేంద్రరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక కోసం బుకింగ్ కౌంటర్లు

- 10 నుంచి 5 గంటల్లోపు కౌంటర్లు
- నేరుగా నమోదు చేసుకునే వెసులుబాటు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 26: ఇసుక బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు రెండు కార్యాలయాల్లో కౌంటర్ల వద్దకు చేరుకుని బుకింగ్ చేసుకోవాలి. కర్నూలు నగరంలోని జిల్లా గనుల శాఖ మరియు భూగర్భ శాఖ కార్యాలయం, కర్నూలు గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాల యం, సీ బెళగల్‌లోని కార్యాలయానికి చేరుకుని నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందు కోసం వినియోగదారుడు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్, చిరునామా, ఇసుక రవాణా వాహనం ఆర్‌సీ జిరాక్స్ తప్పని సరిగా సమర్పించాలని అన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు


ఆలయంలో భక్తుల సందడి

కౌతాళం, ఆగస్టు 26: ఉరుకుందకు భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసపు నాలుగో సోమవారం కావడంతో భక్తులు స్వామి దర్శనానికి భారీగా తరలి వచ్చారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు దేవాలయం ఆవరణలోనే ప్రత్యేక వంటకాలను చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు తలనీలాలు సమర్పించాడానికి వస్తే ఇదే అదునుగా భావించి కల్యాణ కట్టలో గుండుకు వంద ప్రకారం ముక్కు పిండి వసూలు చేశారు. టెంకాయలను ఆలయ అధికారులు సూచించిన ధరలకు కాకుండా అధిక రేట్లకు విక్రయించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా సదుపాయాలను కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమయ్యారు.

నేడు ఆర్‌డబ్ల్యూఎస్‌లో కౌన్సెలింగ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 26: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, డీఈఈలకు మంగళవారం నగరంలోని సర్కిల్ కార్యాలయంలో బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయత్రితో పాటు నాలుగు జిల్లాల ఎస్ఈలు హాజరవుతారరు. కౌన్సెలింగ్ రెండు రోజుల పాటు జరగనుంది. ఎక్కువ మంది ప్రస్తుత ప్రాంతాల్లోనే ఉండేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు మ్యూచ్యువల్ బదిలీలకు సిద్ధమయ్యారు. కొందరు తమకు అనుకూలమైన కేంద్రాలకు బదిలీ చేయించుకునేందుకు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు.

కిమ్స్‌లో బాలిక మృతి వివాదాస్పదం

- చనిపోయినా చికిత్స పేరుతో డబ్బు వసూలు
- రూ.4 లక్షలు చెల్లించామంటూ తల్లిదండ్రుల ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 26: కిమ్స్ ఆసుపత్రిలో ఆరేళ్ల బాలిక మృతి వివాదాస్పదంగా మారింది. రూ.4 లక్షలు వసూలు చేసి చనిపోయిన బిడ్డను చేతికిచ్చారని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతలపల్లెకు చెందిన ఆరేళ్ల బాలిక కావేరికి డెంగీ సోకడంతో తల్లిదండ్రులు పెద్దరాజు, పెద్దక్క ఈ నెల 23న కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే వైద్యులు నాలుగు రోజులకే రూ.4 లక్షలు వసూలు చేశారు. బిడ్డను బతికించుకునేందుకు బర్రెలు అమ్మి ఆ డబ్బును చెల్లించినట్లు తల్లిదండ్రులు వాపోయారు. అయితే సోమవారం ఉదయం బాలిక కొన ఊపిరితో ఉందని, తక్షణమే పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు. అప్పటికే బిడ్డ చనిపోయిందని, మృతి చెందిన బిడ్డను ఇచ్చారని తల్లి కన్నీరుమున్నీరైంది. మృతి చెందిన తమ కూతురుకు చికిత్స చేసి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న పోలీసులు ఎట్టకేలకు పంచాయితీ చేశారు. దీనిపై హాస్పిటల్ సీఓఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ చికిత్సలో తమ నిర్లక్ష్యం లేదని, రోగి తల్లిదండ్రులు తమకు రూ.2.84 లక్షలు కట్టారని అన్నారు. రోగిని అంబుబ్యాగ్‌తో మరో ఆసుపత్రికి తరలిస్తుండగా.. బంధువులు స్టాఫ్‌ను పక్కకు తోయడంతో ఆక్సిజన్ అందక చనిపోయిందని, అవసరమైతే పోస్టుమార్టం చేయించుకోవాలని తెలిపారు.

పాలకొండ సబ్‌కలెక్టర్‌గా చాగలమర్రి వాసి


యశ్వంత్ కుమార్‌రెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 26: పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పాలకొండ సబ్‌కలెక్టర్‌గా చాగలమర్రి మండలం కలుగొట్లపల్లె గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న 8 మంది ఐఏఎస్‌లకు సబ్‌కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ సీఎస్ నిరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. యశ్వంత్‌కుమార్‌రెడ్డి 2021లో ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణలో ఉండగానే 2022లో ఐఏఎస్‌కు కూడా ఎంపికయ్యారు. అంతక ముందు గ్రూప్-1లో ఏసీటీవోగా ఉద్యోగం సాధించారు. పాలకొండ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డికి ఆయా శాఖల అధికారులు, మండల, గ్రామీణ వాసులు అభినందనలు తెలియజేశారు.

రేపటి నుంచి డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 26: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 28న నిర్వహిస్తున్నామని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తెలిపారు. నంద్యాల, ఆదోని, కర్నూలు నగరాల్లోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 1145 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి హాలు టికెట్లు ప్రిన్సిపాల్స్ వద్ద పొందాలని పేర్కొన్నారు.

ముగిసిన మొహర్రం 40 రోజుల వేడుకలు

బనగానపల్లె, ఆగస్టు 26: బనగానపల్లె పట్టణంలో మొహర్రం 40 రోజుల వేడుకలు సోమవారంతో ముగిశాయి. మొహర్రం సందర్భంగా కర్బాలాలో ప్రాణాలు కోల్పోయిన ఇమాం హుసేన్, ఇమాం కాసీం జ్ఞాపకార్థం షియా ముస్లింలు విషాద గీతాలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. వీరమరణం పొందిన వారిని తలుచుంటూ పట్టణంలో విషాద గీతాలు ఆలపిస్తూ వేడుకలు జరుపుకున్నారు. అధిక సంఖ్యలో ఈ విషాద వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

కర్నూలు, ఆగస్టు 26: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ కేసులో నిందితుడు వంశీని పోలీసులు అరెస్టు చేశారు. వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వంశీ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి కల్లూరులోని చౌడేశ్వరి దేవాలయం సమీపంలో ఉన్న ఓ సెల్ ఫోన్ దుకాణానికి కన్నం వేసి 12 సెల్‌ఫోన్లు, రెండు కెమెరాలు చోరీ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందతుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, రెండు కెమెరాలు రికవరీ చేశారు.

20 నుంచి గాలికుంటు నివారణకు టీకాలు

జిల్లా వ్యాధి నిర్ధారణ అధికారి రవిబాబు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 26: కర్నూలు జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు గాలికుంటు నివారణకు టీకాలు వేస్తున్నామని జిల్లా వ్యాధి నిర్ధారణ అధికారి రవిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడీ పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి, పని సామర్థ్యం తగ్గుతాయని, రైతులకు ఆర్థిక నష్టం జరుగుతుందని, పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయని అన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు లాల్ బాఘ్డా రాక

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 26: నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) దక్షిణాంధ్రప్రదేశ్ కేంద్ర కార్యాలయం మొదటి అంతస్తు ప్రారంభోత్సవానికి బుధవారం బజరంగ్‌దళ్ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి లాల్ బాఘ్డా హాజరవుతున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి తెలిపారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో కలిసి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, దేశవ్యాప్తంగా వీహెచ్‌పీ షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా వీహెచ్‌పీ వేడుకలతోపాటూ, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ దాతృత్వంతో, ఆయన తండ్రిగారైన టీజీ గోపాల్ శెట్టి స్మారకంగా నిర్మించిన ఈ సమావేశ భవనాన్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభిస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు లాల్ బాఘ్డా కర్నూలు చేరుకుంటారని, 5 గంటలకు మీడియా సమావేశం, 6 గంటలకు టీజీ గోపాల్‌శెట్టి సమావేశ భవనం ప్రారంభోత్సవం ఉంటుందని వివరించారు. అనంతరం భరత మాత మందిర ప్రాంగణంలో సభ ఉంటుందని అన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా వీహెచ్‌పీ 60 ఏళ్ల విశేష సంచిక విడుదల ఉంటుందని తెలిపారు.

ఐదు వాహనాలు సీజ్

ప్యాపిలి, ఆగస్టు 26: ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అయితే ఈ అక్రమ తవ్వకాల వెనుక ఎవరు ఉన్నారో సమగ్ర విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 26 : రాష్ట్రంలోని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) సభ్యత్వ కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర అసోసియేట్ ప్రధాన కార్యదర్శి ఎంవీ శేషఫణిరాజు, రాష్ట్ర కార్యదర్శి విజయబాబు, జిల్లా అధ్యక్షుడు ఎం.బజారప్ప, ప్రధాన కార్యదర్శి బి.సుభహాన్ సింగ్, ఆర్థిక కార్యదర్శి ఎండీ హుశేన్, కార్యవర్గ సభ్యులు ప్రతాప్, బాలకృష్ణ, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంటులో చోరీ

కర్నూలు, ఆగస్టు 26: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తబస్టాండు వెనుకాల ఉన్న రీజెంట్ అపార్టుమెంటు లో భవానిప్రసాద్ అనే వ్యక్తి ప్లాటులో చోరీ జరిగింది. భవాని ప్రసాద్ ఓ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగి. ఈయన ఈ ఏడాది మే చివరి వారంలో తన ప్లాటులో పెయింటింగ్ పనులు చేయించాడు. పెయింటింగ్ పనులు చేసే సమయంలో ఇంట్లో కబోర్డులో రూ.8 లక్షల నగదు ఉంచాడు. ఆ తర్వాత పనులు పూర్తయ్యాక నగదు గురించి మరిచిపోయాడు. ఇటీవల నగదు కోసం చూస్తే కనిపించలేదు. దీంతో పెయింటర్స్‌పై అనుమానంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెయింటింగ్ చివరి రోజు పెయింటర్లు అనుమానంగా తొందరగా పని ముగించుకుని వెళ్లినట్లు గుర్తించి వారిపై పిర్యాదు చేశారు. బాదితుని పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


మృతి చెందిన కార్మికుడు వెంకట సుబ్బన్న

అవుకు, ఆగస్టు 26: విద్యుదాఘాతంతో నాపరాతి పరిశ్రమ కార్మికుడు మృతి చెందిన ఘటన అవుకు మండలంలోని సంగపట్నంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామ పరిధిలోని నాపరాతి గనుల్లో కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన దాసరి వెంకట సుబ్బన్న (47) పనిచేస్తున్నాడు. ఉదయం సంగపట్నం గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి నాపరాతి గనిలో పని చేసేందుకు వెంకట సుబ్బన్నతో కలిసి వెళ్లాడు. గనిలో నాపరాళ్లను కటింగ్ చేసే యంత్రానికి విద్యుత్ సరఫరా కాకపోవటంతో విద్యుత్ వైర్లకు మరమత్తులు చేస్తుండగా వెంకటసుబ్బన్న విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాజారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోర్లగుట్టలో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల, ఆగస్టు 26: మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో బోయినపల్లి హనుమంతు (42)అనే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమంతు అంకిరెడ్డి పల్లెకు చెందిన చిన్న కుల్లాయమ్మను పదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. కడుపునొప్పితో బాధపడుతున్న హనుమంతు జీవితంపై విరక్తి చెంది వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి ఘటన స్థలానికి వెళ్లి ఆత్మహత్య గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెలుంగుహల అందాలు అద్భుతం

కలెక్టర్ రాజకుమారి


బెలుంగుహల వద్ద కలెక్టర్

కొలిమిగుండ్ల, ఆగస్టు 26 : కొన్ని వందల సంవత్సరాల క్రితం సహజ సిద్ధంగా ఏర్పడిన బెలుం గుహల అందాలు అద్భుతంగా ఉన్నాయని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుంగుహలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గుహల యూనిట్ మేనేజర్, సిబ్బంది కలెక్టర్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం గుహల్లోని ముఖ్య ప్రదేశాలైన పాతాళగంగ, ఊడలమర్రి, సన్యాసి మఠం, వెయ్యి పడగలు తదితర ప్రాంతాలను సందర్శించి, పర్యాటకుల కోసం గుహల్లో ఏర్పాటు చేపట్టిన పనులను ఆమె అడిగి తెలుసుకున్నారు. లైటింగ్స్, బ్లోయర్స్ ఇతర అభివృద్ధి పనులపై కలెక్టర్‌ఆరాతీశారు. కాగా యాగంటి, బ్రహ్మంగారి మఠం, బెలుం గుహలు, అవుకు రిజర్వాయర్, బోటింగ్ తదితర ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్కిల్ ఏర్పాటుపై కలెక్టర్ రాజకుమారి పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 26: మండలంలోని వర్కూరు పెట్రోలు బంకు సమీపంలోని మలుపు వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదోని నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు, కర్నూలు నుంచి ఆదోని వెళ్తున్న కారు వర్కూరు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఇస్మాయిల్, హబిదాబీబేగంలు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదే మలుపు వద్ద పలుమార్లు వాహన ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి, ఆగస్టు 26: రైలు కింద పడి పెద్దపాపన్న (55) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మండల పరిధిలోని బొల్లవానిపల్లె సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద రైలు కింద పడి అఘాయిత్యం చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని డోన్ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య వరాలమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వైభవంగా కృష్ణాష్టమి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి ● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



బండిఆత్మకూరులో బాలకృష్ణుడి ఊయల ఉత్సవం నిర్వహిస్తున్న యాదవులు



ఆత్మకూరు రూరల్: కరివేనలో పూజలు చేస్తున్న భక్తులు



మిడుతూరులో ఉట్టి కొడుతున్న గ్రామస్తులు



వెలుగోడు మండలంలో..



మహానంది: తిమ్మాపురంలో..



పాణ్యంలో..



కొత్తపల్లిలో.



జూపాడుబంగ్లా: తంగడంచలో..



గడివేముల: దుర్వేసి గ్రామంలో..



ఆత్మకూరులో వేషధారణలో చిన్నారులు



నంద్యాల కల్చరల్: నంద్యాలలో..

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 26: నంద్యాల చిత్తలూరి వారి వీధిలో వెలసిన శ్రీకృష్ణమందిరంలో సముద్రాల ఆంజనేయులు, పాండురంగయ్యల ఆధ్వర్యంలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణునికి తులసిమాలలచే ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నంద్యాల బాలచంద్ర సమతా విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులచే కృష్ణ, గోపికలు, వేషధారణ, నృత్య ప్రదర్శనలు, ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

● నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీ కృష్ణమందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు పార్థసారథికృష్ణ, విజయచంద్రుడు, శివశంకర్ యాదవ్ మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి, ఫిరోజ్‌తో పాటు కౌన్సిలర్లు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, నాగార్జున, మాజీ కౌన్సిలర్ విశ్వనాథ రెడ్డిని సన్మానించారు. శ్రీకృష్ణమందిరం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహానంది: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఎం.తిమ్మాపురంలోని శ్రీకృష్ణుని ఆలయంలో అర్చకులు విశేష పూజలతో ఉట్టి ఉత్సవంను జరిపారు. గోపవరంలో మాజీ ఎంపీపీ చింతం నాగమణి, టీడీపీ నాయకుడు క్రాంతికుమార్ యాదవ్ దంపతులు శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకార్చనలు, యి. బొల్లవరం గ్రామంలో టీడీపీ నాయకుడు కిలార్ వెంకటేశ్వర్లు, వెంకట్రాముడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని గోపికల వేషధారణ పలువురిని ఆకట్టుకొంది. అనంతరం యాదవ సంఘం సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేసారు.

మిడుతూరు: మండలంలోని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిడుతూరుని శ్రీకృష్ణుడి ఆలయంలో గణపతి పూజ, గోపూజ నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్కూల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణ చిన్నారులు ఆకట్టుకున్నారు. సాయంత్రం గ్రామంలో స్వామిని మేళతాళాలతో ఊరేగించారు. చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. యాదవ కుటుంబాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని జూపాడుబంగ్లా, తంగడంచ, 80బన్నూరు, తాటిపాడు, భాస్కరాపురం, మండ్లెం తదితర గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాషమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామాల్లో చిన్నారులు శ్రీకృష్ణుని వేషాధారణ అందరిని ఆకర్శించాయి.

బండిఆత్మకూరు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను యాదవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. బండిఆత్మకూరులో కృష్ణునికి పూజలు చేసి ఊయల ఉత్సవం నిర్వహించారు. మోడల్‌స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ రమేష్‌యాదవ్ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని కరివేన గ్రామంలో వెలసిన రామాలయం ఆవరణలో యాదవ సంఘం ఆధ్వర్యంలో, శ్రీపతిరావు పేట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో, వెంకటాపురం గ్రామంలోని రాజ రాజేశ్వరి మాత ఆలయంలో వెలసిన శ్రీక్రిష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులకు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గ్రామోత్సవాన్ని నిర్వహించి, ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. శ్రీపతిరావుపేట గ్రామోత్సవంలో కోలాటాల కోలాహలం, చిన్నారుల నృత్యాలతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతి శిశు మందిరం, బృందావన్ పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఊపలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమాలు సైతం నిర్వహించారు. చిన్నారులు ప్రధాన సెంటరులో నిర్వహించిన కార్యక్రమం వద్దకు ఆత్మ కూరు డీఎస్పీ రామాంజి నాయక్, వెలుగోడు ఎస్ఐ విష్ణునారాయణలు అక్కడికి చేరుకుని చిన్నారుల కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దుర్వేసి గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడివేములలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. తల్లిదండ్రులు, చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ వేయించారు.

పాణ్యం: మండలంలో గోకులాష్టమి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. పాణ్యంలోని వీరనారాయణస్వామి ఆలయంలో ఈవో సువర్ణ ఆధ్వర్యంలో స్వామివారికి అహాభిషేకం, పూజా కైంకర్యాలు, మహానైవేద్యాది కార్యక్రమాలు, శ్రీవారి పూలంగిసేవలు, అర్చన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రథోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన భక్తులు స్వామివారికి పత్యేక పూలఅలంకరణ గావించారు. కందికాయపల్లె కృష్ణమ్మకోనలో శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక భజనలు, తెలంగాణ కోటాటం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని తోటగేరి, గొల్లపేట, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని చిన్నారులకు వేషాధారణలు నిర్వహించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి, ఎర్రమఠం, చిన్నగుమ్మడాపురం, పెద్దగుమ్మడాపురం గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కొత్తపల్లిలో రాధాకృష్ణ ఉత్సవమూర్తులను పురోహితులు లక్ష్మీ నరసయ్యశర్మ శాస్త్రోక్తంగా విచ్చేసిన భక్తులకు సమక్షంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు.

'హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి'

ఆత్మకూరు, ఆగస్టు 26: హిందూధర్మాన్ని పరిరక్షించేందుకు హిందూ సమాజం ఏకీకృతం కావాల్సిన అవసరం ఉందని ఆత్మకూరు ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్ అన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 29న ఆత్మకూరులో నిర్వహించే హిందూ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరులోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో సాయంత్రం 4గంటలకు జరిగే హిందూ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హిందువులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణ ప్రధాన పురోహితులు గరుడాద్రి సత్యనారాయణశర్మ, వీహెచ్‌పీ నాయకులు శ్రీధర్‌గుప్తా, భానుమూర్తి, ఆవులరెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో గోపూజ



గోపూజలో పాల్గొన్న ఈవో దంపతులు

శ్రీశైలం, ఆగస్టు 26: శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులం, దేవస్థానం గో సంరక్షణశాలలోని గోవులకు, గోవత్సాలకు విశేషంగా పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు పూజాసంకల్పాన్ని పఠించారు. అనంతరం శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతోనూ, గోవులకు షోడశ ఉపచారాలతో పూజాధికాలు జరిపి గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తరువాత దేవస్థానం గో సంరక్షణశాలలోని కృష్ణునికి విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్, పర్యవేక్షకులు స్వర్ణలత, అర్చకులు, వేదపండితులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం



ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఆగస్టు 26: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్దె బస్సుల సర్వీసులను సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించి అక్కడి సమస్యలను డిపో మేనేజర్ మహేంద్రుడిని అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలోని రామాలయానికి వెళ్లేందుకు రస్తా సమస్య ఉందని ఆర్టీసీ ఉద్యోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డిపోలో కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు భవన నిర్మాణం చేపట్టాలని కార్మికులు కోరారు. సిద్దాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సదుపాయం లేక గ్రామానికి చెందిన సుమారు 110 విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు అందుబాటులో ఉంచాలని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు జవహర్‌నాయక్ ఎమ్మెల్యే బుడ్డాకు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు రవిప్రసాద్, రాజారెడ్డి ఉన్నారు.

వెలుగోడు: విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన జీవో నంబర్ 117,128 లను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య, జిల్లా సబ్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం మండలంలోని వేల్పనూరులో ఈ మేరకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఆయా సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు మగ్బుల్ బాషా, ఆదినారాయణ, నూరుల్లా, వీరేశ్వరరెడ్డి, జాకీర్‌హుసేన్, మల్లేశ్వర్, ఆదినారాయణ, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

● వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని స్వగృహంలో ఆయనను ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జం రామసుబ్బారెడ్డి, ఆత్మకూరు యూనిట్ అధ్యక్షుడు మల్లయ్య, సెక్రటరీ ఫయాజ్ అలిఖాన్, ట్రెజరర్ సాయి ప్రణీత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల గురించి వారు ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంల్లో, ప్రైవేట్ పాఠశాలల అసోషియేషన్ సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా మహానందీశ్వరుడి పల్లకీ సేవ

మహానంది, ఆగస్టు 26: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవా ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఆశీనులు గావించారు. అనంతరం వేదమంత్రాలతో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హారతులను భక్తిశ్రద్ధలతో ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య మేళతాళాలతో పల్లకీ ఉత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల రద్దీ: మహానంది క్షేత్రంలో సోమవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది, వరుససెలవులతో పాటు శ్రావణమాసం ముగింపు పురష్కరించుకొని వేలాదిమంది భక్తులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. సాయంత్రం వరకు క్షేత్ర పరిసరాలు భక్తుల రద్దీతో నిండిపోయాయి. గత మూడు రోజుల నుంచి మహానంది భక్త జన సంద్రంగా నిండి పోయింది. పరమ శివునికి పదుల సంఖ్యలో భక్తులు అభిషేకాలు నిర్వహించుకొన్నారు.

బంగారు వస్తువు అప్పగింత

మహానంది, ఆగస్టు 26: దైవ దర్శనం కోసం వచ్చి ముందుగా ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తురాలి బంగారు చెవి కమ్మ జారవిడుచుకుంది. విషయాన్ని బాధిత భక్తురాలు ఆలయ హోంగార్డు బాలుడు దృష్టికి తీసుకొచ్చింది. కోనేరులో వెతికించి తిరిగి బాధితురాలికి అప్పగించారు. సోమవారం విజయనగరానికి చెందిన రమ్య దంపతులు దర్శనం కోసం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు చేస్తున్న క్రమంలో భక్తురాలి బంగారు కమ్మ జారి పడింది. విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు దృష్టికి తేవడంతో స్థానిక చెంచు యువకులతో వెతికించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా బాధిత భక్తురాలికి అప్పగించారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

ఆత్మకూరు, ఆగస్టు 26: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రాధాన్యత క్రమంలో ప్రజావినతులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వారికి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

'గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

వచ్చే వినాయక చవితి పట్టణ ప్రజ లందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రామాంజి నాయక్ సూచిం చారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో వివిధ మతాల పెద్దలు, మంటపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు.

రేపటి నుంచి హుండీ లెక్కింపు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 26: నంద్యాలలోని కాశికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు, బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానంలో మధ్యాహ్న 2గంటలకు, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లెక్కించనున్నట్లు ఆలయాల ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. 29న ఉదయం 10గంటలకు, మల్లికార్జునస్వామి దేవస్థానంలో, మధ్యాహ్నం 12గంటలకు, శ్రీకృష్ణ భజన మందిరంలో సాయంత్రం 3గంటలకు హుండీ లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

'సమస్యాత్మక గ్రామాలపై నిఘా'

మహానంది, ఆగస్టు 26: సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచినట్లు నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మసీదుపురం, గోపవరం, సీతారామపురంలో ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించారు. టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాలు అభినందనీయం'



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 26: మదర్ థెరిసా జయంతి, కృష్ణాష్టమిని పురస్కరించుకుని యువత సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. సోమవారం పొన్నాపురంలో 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి జగదీష్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులు, గర్భిణుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా తైక్వాండో ఎంపిక పోటీలు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 26: ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్‌ఆధ్వర్యంలో బుధవారం నంద్యాలలోని ఇండోర్ స్టేడియంలో తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి సోమవారం తెలిపారు. ఉమెన్ లీగ్, సీనియర్ మెన్, ఉమెన్ తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, ఒక పాస్ ఫొటోతో స్టేడియంలో హాజరు కావాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి ఎంట్రీ ఫీజు అవసరం లేదన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఉమన్స్ తిరుపతిలో 31, 1వ తేదీ జరిగే రాష్ట్ర స్థాయి అస్మితా ఉమన్స్ లీగ్ ఖేలో ఇండియా పోటీలలో, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 7801011281, 9052144046 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

'వ్యవసాయరంగ పరిరక్షణకు ఉద్యమాలు'

మిడుతూరు, ఆగస్టు 26: పాలకుల విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందని, ఈ రంగపరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పకీర సాహెబ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సమావేశాలు ఈ నెల 29, 30 తేదీల్లో ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం మండలంలోని చౌట్కూరు గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఓబులేసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పకీర సాహెబ్, గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో అధికశాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తోందని, అయితే ఆ రంగానికి పాలకులు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో సంక్షోభంలోకి కూరుకుపోతెందని అన్నారు. వ్యవసాయరంగ పరిరక్షణ కోసం సమైక్య ఉద్యమాలు సాగించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు వడ్డె మద్దిలేటి, పెద్దస్వాములు, సామేలు, రాజు పాల్గొన్నారు.

కొలువుదీరిన మౌలాలి స్వామి పీరు

కొత్తపల్లి, ఆగస్టు 26: కొత్తపల్లి మండల కేంద్రంలో సోమవారం మౌలాలి స్వామి పీరు కొలువుదీరాయి. భక్తులు భక్తితో మౌలాలి స్వామి పీర్లకు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ నెల 29న మౌలాలి స్వామి పెద్ద సరిగెత్తు, 30న శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ వేడుకల కోసం మండల కేంద్రంలో వెలసిన పార్వతి సమేత శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి ఆలయ, పూర్వపు అర్చకులు ఉమామహేశ్వరశర్మ మొక్కుబడిగా మౌలాలి స్వామి సరిగెత్తు రెండు రోజులకయ్యే ఖర్చు రూ.40వేలు మొక్కుబడి చెల్లించారు.

చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 26: నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్, బాలికల చెస్ పోటీలు నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్, క్రీడా భారతి జిల్లా కార్యదర్శి సుధాకర్, ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ.. చదరంగం మెదడుకు పదును పెడుతుందని, ఈ క్రీడలతో పిల్లల్లో మానసిక వికాసం కలుగుతుందని, ఏకాగ్రత పెరుగుతందని అన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని, ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సీఎం చంద్రబాబుతోనే అన్ని వర్గాల అభివృద్ధి



టీఈ కేశన్నగౌడును సన్మానిస్తున్న చనుగొండ్ల పార్టీ నాయకులు

డోన్, ఆగస్టు 26: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో కేశన్నగౌడును చనుగొండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలిశారు. డోన్ కస్తూర్బా పాఠశాల కమిటీ చైర్మన్‌గా సువర్ణ ఎంపికకు సహకరించిన కేశన్నగౌడును వారు సన్మానించారు. కేశన్నగౌడు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారనీ అన్నారు. సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలనతో దేశంలోనే టాప్-5 సీఎంలలో స్థానం దక్కించుకోవడం హర్షణీయమన్నారు.

వర్షం కోసం పూజలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 26 : వర్షం కోసం చింతలాయపల్లె గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ టీడీపీ నేత అంబటి జయలక్ష్మీరెడ్డి, యువ నాయకులు అంబటి వివేకానందరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో స్వామి వారికి పవిత్ర జలాభిషేకం, పాలాభిషేకాలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోవెలకుంట్ల, ఆగస్టు 26 : గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రేవనూరు ఎస్ఐ భూపాలుడు అన్నారు. సోమవారం రేవనూరు పోలీసుస్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలకు పాల్పడరాదని ఆయన హెచ్చరించారు. ఘర్షణలకు పాల్పడితే పోలీసుల లాఠి పవర్ చూపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబులు గంగన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

యాగంటి సన్నిధిలో జిల్లా కలెక్టర్



యాగంటి క్షేత్రంలో కలెక్టర్ రాజకుమారికి ప్రసాదం అందిస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

బనగానపల్లె , ఆగస్టు 26: యాగంటి ఉమామహేశ్వరస్వామి సన్నిధిలో కలెక్టర్ రాజకుమారి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పూజారి, సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు ఆలయ ఈవో, పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యాగంటిలో పల్లకీ సేవ: బనగానపల్లె మండలంలోని ప్రముఖయ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వెలిగిన వీధి లైట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొలిమిగుండ్ల, ఆగస్టు 26 : కొలిమిగుండ్లలోని శాంతినగర్‌లో ఎట్టకేలకు వీధి లైట్లు వెలిగాయి. సోమవారం 'వెలగని వీధి లైట్లు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు'.. అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వీధి లేట్లకు మరమ్మతులు నిర్వహించి, పునరుద్ధరించారు.

గ్రామీణాభివృద్ధికి కృషి చేద్దాం



విరాళంగా హుండీని అందిస్తున్న భక్తుడు

బనగానపల్లె, ఆగస్టు 26: గ్రామీణ దేవాలయాభివృద్ధికి కృషి చేద్దామని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో రామాలయానికి హుండీని విరాళం అందించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రాంపుల్లారెడ్డి, కెజి.వెంకటసుబ్బయ్యగౌడ్, బాలహనుమంతు, తిరుమలేశ్ పాల్గొన్నారు.

పొలం గట్ల విషయంలో ఘర్షణ

చాగలమర్రి, ఆగస్టు 26: మండలంలోని ఆవులపల్లె గ్రామానికి చెందిన నారాయణ, వెంకటకృష్ణయ్య మధ్య పొలంగట్ల విషయంలో సోమవారం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో నారాయణ, మనోహర్, మహాలక్ష్మి గాయపడ్డారు. గాయపడిన వారికి చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. వీరిలో మహాలక్ష్మి, నారాయణలను మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. దాడికి పాల్పడ్డ వెంకటకృష్ణయ్య, నారాయణ, నాగేష్‌పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.



కోవెలకుంట్లలో పూజలు చేస్తున్న భక్తులు



కొలిమిగుండ్లలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా కృష్ణాష్టమి

కొలిమిగుండ్ల, ఆగస్టు 26 : మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. బెలుం, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో విశేష పూజలు నిర్వహించి, గ్రామోత్సవం చేశారు. కొలిమిగుండ్లలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల, మీర్జాపురం, నాయినిపల్లె, బందార్లపల్లె గ్రామాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమలను మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, గూడురు నాగేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌యాదవ్, రాజనేని బ్రదర్, పోరెడ్డి చిన్నపురెడ్డి, త్రైత సిద్ధాంత సభ్యులు రవిచంద్రయాదవ్, మీర్జాపురం పిఎంహెచ్ నాయుడు, క్రిష్టారెడ్డి, బాబు, బాలు, భూపాల్, భక్తులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసరస్వతి శిశుమందిరం విద్యార్థులు వేసిన శ్రీకృష్ణుడు, గోపిక వేశాలు అలరించాయి.

అవుకు: మండలంలోని ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా సోమవారం జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లోని శ్రీకృష్ణుడు ఆలయాల్లో పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే అవుకు పట్టణంలోని మదర్‌మోడల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడకలను నిర్వహించారు.

బనగానపల్లె: మండంలోని యనకండ్ల గ్రామంలోని శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు యాదవసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, అర్చన పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీసభ్యులు సానెం బాలసుబ్బయ్యయాదవ్, బాణాల రామసుబ్బయ్య, పెండేకంటి వెంకటసుబ్బయ్య, దాట్లశ్రీరాముల యాదవ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో భక్తులు వైభవంగా సోమవారం నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్ ఉన్నత ప్రాథమిక పాఠశాలల విద్యార్థులచే శ్రీకృష్ణుడు, రాధమ్మ, గోపికల వేషాధారణలతో ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, హుశేన్ రెడ్డి, మద్దిలేటి స్వామి, మధుసూదన్ రెడ్డి, వీరారెడ్డి ఉన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను వైభవంగా ప్రారంభించారు. ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కోవెలకుంట్ల అధ్యక్షులు జనార్దన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఇంటి పక్కన ఉన్న స్టేట్‌బ్యాంకు రోడ్డులో శ్రీకృష్ణ ప్రతిభ ప్రతిష్ఠించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: కృష్ణాష్టమి వేడుకలను గ్రామాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా సోమవారం జరుపుకొన్నారు. అహోబిలం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఇస్కాన్ అహోబిలం ప్రాజెక్టు ఇన్‌చార్జి చంద్ర కేవశ దాసు ప్రభు చేపట్టారు. అలాగే పట్టణంలోని గోకుల కృష్ణ దేవాలయంలో, ఆర్యవైశ్య గీతామందిరంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలను నిర్వహించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఎస్ఎస్ఎఫ్, హిందూ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివరామానంద ఆశ్రమంలో అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి హోమం, ఉట్టి కొట్టుట కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. భారతీ విద్యా మందిరం విద్యార్థులు కోలాటం చేశారు. అనంతరం శ్రీకృష్ణ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీరింప చేసి ఇస్కాన్‌వారి ఆధ్వర్యంలో నగర సంకీర్తన చిన్ని కృష్ణుల వేషధారణ వేసిన చిన్నారులతో గ్రామోత్సవం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు గ్రామంలో వెలసిన శ్రీకృష్ణుడిని యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిరివెళ్ల : మండలంలోని యర్రగుంట్లలో సద్గురు రామకృష్ణానంద గీతాశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడి మూలవిరాట్‌కు పూజలు చేశారు. యర్రగుంట్ల, వెంకటాపురం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

డోన్(రూరల్): పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండులో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ప్రబోదానందా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ప్రబోదానంద సేవా సమితి సభ్యులు నాగార్జున, సుబ్బయ్య, నాగేంద్ర, సర్వేశ్వరయ్య, గిరిల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

రుద్రవరం: మండడలంలోని హరినగరం ఇస్కాన్ దేవాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణుడు కొలువుదీరిన ఉయ్యాల తొట్టిని ఊపి భక్తిని చాటుకన్నారు. రాధామనోహర్ దాస్ కృష్ణభగవాన్ వేదాంతం గురించి వివరించారు. కూచిపూడి నాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఉట్టి కొట్టే వేడుకలో యువకలు ఉత్సాహం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయం మేనేజరు చంద్రకేశవదాస్, లోకేశ్వరి మాతాజీ, అహోబిళం ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్, పాల్గొన్నారు



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అవుకులో నృత్యం చేస్తున్న చిన్నారులు



యనకండ్లలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



చాగలమర్రిలో ఊరేగింపు



సందేశం వినిపిస్తున్న ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్



ఉట్టి కొడుతున్న యువకులు

కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే



డోన్, బేతంచెర్ల నాయకులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



డోన్, ఆగస్టు 26 : టీడీపీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసిన పలువురు టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా సోమవారం అందజేశారు. లద్దగిరిలోని తన నివాసంలో ప్రశాంసాపత్రాలు అందజేసి పార్టీ కార్యకర్తలను అభినందించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గంలోని టీడీపీ అధినేతలు చంద్రబాబు, నాయకత్వంలో ఐటీడీపీ ద్వారా వైసీపీ వైఫల్యాలను ఎమ్మెల్యే విస్తృతంగా తీసుకెల్లారన్నారు. పార్టీ గెలుపు కోసం అందించిన సేవాగుణం గుర్తించి సీఎం చంద్రబాబు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు.

ప్యాపిలి: సోషల్ మీడియాలో చురుగ్గా పనిచేసిన టీడీపీ యువకులు వడ్డే మాదవరాజు, నరేంద్రయాదవ్‌కు ఆ పార్టీ కేంద్ర కార్యాలయ ప్రశంసా పత్రాలు అందజేసింది. టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకపోవడంతో పాటు అదే సమయంలో వైసీపీ దుర్మార్గ పాలనను సోషల్ మీడియాలో ఎండగట్టడంలో యువత క్రియాశీలంగా పనిచేయడంతో పార్టీ అధిష్ఠానం పత్రాలను అందజేసింది. సోమవారం ప్రశంసా పత్రాలు అందుకున్న యువకులు మాధవరాజు, నరేంద్రయాదవ్‌లు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బేతంచెర్ల: టీడీపీ బలోపేతానికి టీడీపీ యాప్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించిన బేతంచెర్ల టీడీపీ నాయకులకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. టీడీపీకి అన్ని రకాలుగా అండగా ఉంటూ కూటమి విజయానికి కృషి చేసిన నాయకులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అందజేసిన ప్రశంసా అభినందన పత్రాలను ఎమ్మె ల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సోమవారం అందజేశారు. అందజేశారు. ప్రశంసాపత్రాలను అందుకున్న వారిలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, జాకీరుల్లా భేగ్, కార్యకర్తలు ఉన్నారు.

ఐదు వీల్ చైర్లు విరాళం



ఆలయ ఈవోకు ఐదు వీల్ చైర్లు అందజేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా.గోవిందరెడ్డి

బేతంచెర్ల, ఆగస్టు 26: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా.గోవిందరెడ్డి ఐదు వీల్ చైర్లను సోమవారం విరాళంగా అందజేశారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా నడవలేని వృద్ధుల భక్తుల సౌకర్యార్థం సులభతరంగా స్వామివారి దర్శనం చేసుకునేందుకు వీల్ చైర్లను ఉపయోగించాలన్నారు. వారికి స్వామి వారి తీర్థప్రసాదాలను ఆలయ ఈవో రామాంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలోసొసైటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

బేతంచెర్ల, ఆగస్టు 26: మండలంలో అంబాపురం గ్రామంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇంటి నిర్మాణాలను చేపట్టాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు అన్నారు. సోమవారం గ్రామ శాఖ సమావేశం స్థానిక నాయకుడు నాగేశ్వరరావు సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అహంకారం తగ్గించుకుని, మంచి పాలన అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, నాగేష్, భాస్కర్, నాగ తిమ్మయ్య, జమాల్‌బాషా పాల్గొన్నారు.

తిమ్మనాయినిపేటలో చెరువు కట్ట సమారాధన



పూజలు చేస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 26: మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామ సమీపంలోని తిమ్మనాయుని చెరువు ప్రాంగణంలో సోమవారం చెరువు కట్ట సమారాధన కార్యక్రమం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదుగురు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకం, యాగం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా సహపంక్తి భోజనం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, చెరువు నిండాలన్న సంకల్పంతో పూజలు చేశామని గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు తప్పవు

డోన్ డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్యాపిలి, ఆగస్టు 26: ప్రభుత్వ ఆస్తులను, నిర్మాణాలను ధ్వంసం చేస్తే కేసులు తప్పవని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణంలో కొందరు అక్రమంగా రోడ్డు డివైడర్‌ను పగలగొట్టడం, రోడ్డును తవ్వినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇటువంటి దౌర్జన్య కార్యక్రమాలు చేయరాదన్నారు. ప్రభుత్వ నిర్మాణాలను పగులగొట్టే ముందుగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవలసి వస్తుందని డీఎస్పీ హెచ్చరించారు. అలాగే పేకాట, సారా అమ్మకాలు, మట్కా వంటి అసాంఘీక కార్యకలాపాల నిర్మూలనకు పోలీసు యంత్రాంగా గట్టిగా కృషి చేస్తున్నట్లు చెప్పారు సమావేశంలో ప్యాపిలి, డోన్ రూరల్ సీఐలు వెంకటరామిరెడ్డి, సీఎం రాకేష్ పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రతాప్‌రెడ్డి

బనగానపల్లె , ఆగస్టు 26: ఏపీలో హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి హిందువుపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు తూముకుంట ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో హిందూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో విశ్వహిందూపరిషత్ నాయకులు మాట్లాడుతూ హిందువులు కులాలను పక్కన పెట్టి ఐకమత్యంగా మందుకు వెళ్లాన్నారు. దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె విశ్వ హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఓబుళరెడ్డి, అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి కిశోర్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, లాయర్ జగన్నాథరెడ్డి, నాగమల్లారెడ్డి, విశ్వనాథరెడ్డి, గంగాభవానిదేవి, పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం'



జీనేపల్లెలో ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, ఆగస్టు 26: టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎళ్లవేళలా అండగా ఉంటామని ఆ పార్టీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని జీనేపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హుసేన్ బాషా తల్లి రమిజాబీ గుండె పోటుతో మృతి చెందడంతో గుంప్రమాన్‌దిన్నె నాయకుడు కుందూరు మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురళితో కలిసి ఆయన సోమవారం నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం టీడీపీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని హుసేన్ బాషాకు అందజేశారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'



మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, ఆగస్టు 26: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు రామతీర్థం, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ తెలిపారు. సోమవారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీల నిధులను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. బీసీ సంఘ నాయకులు పీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, సిద్ధప్ప, చిన్నికృష్ణయ్య, వాసు, శ్రీనివాసులు, లాలయ్య పాల్గొన్నారు.

కుందూలో 13 వేల క్యూసెక్కుల నీరు



చాగలమర్రి, ఆగస్టు 26: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కుందూనది 13 వేల క్యూసెక్కులతో వరద నీరు ప్రవహిస్తోంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నది పొంగి ప్రవహిస్తోంది. ఆనకట్టవద్ద గల 5 గేట్లను ఎత్తి కడప జిల్లావైపు 12 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామని కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట సమీపంలోని కేసీ ప్రధాన కాలువకు 850 క్యూసెక్కుల నీరు, చాపాడు చానల్‌కు 150 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.

నిలిచిన ప్రహరీ పనులు

- గడ్డ కట్టిన వంద బస్తాల సిమెంటు



గడ్డ కట్టిన సిమెంటు బస్తాలు

రుద్రవరం, ఆగస్టు 26: మండలంలోని చిత్తరేణిపల్లెలో ప్రాథమిక పాఠశాల రెండో విడత నాడు-నేడు కింద ఎంపికైంది. రూ.24 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల ప్రహరీ పనులు నిలిచిపోవడంతో వంద బస్తాలు సిమెంటు గడ్డ కట్టింది. ఈ పాఠశాలలో 1 నుంచి 5 వరకు 56 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల గ్రామానికి దూరంగా పంట పొలాల్లో ఉంది. పాఠశాల చుట్టూ ప్రహరీ , పాఠశాలకు మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఇక్కడ సమస్య తలెత్తడంతో పనులు నిలిచాయి. ఈ విషయంపై హెచ్ఎం సంపత్‌కుమార్ మాట్లాడుతూ పనులు నిలిచిపోయిన విషయం విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దారి సమస్య ఉండడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు.